# ఎజికె కథలు

## ఎ.జి.కృష్ణమూర్తి

మన దేశం నేపథ్యంలో – సమకాలీన ఆధునిక జీవితాన్ని
అవగాహన చేసుకునేందుకూ, సమాజంలో భాగస్వాములమై
స్వీయ జీవితాన్ని సుఖతరం చేసుకునేందుకూ –
సహకరించే ఈ కథలు
కథారచనలో ఎజికె అపూర్వ ముద్రను పరిచయం చేస్తాయి.
అలా ఈ కథాసంపుటి ఓ అపూర్వ కథాస'ముద్ర'ం!
– వసుంధర

ఎమెస్కో

## ఇందులో....


| | | | |
|---|---|---|---|
| ★ | అమ్మ కథ<br>*('నవ్య' వార పత్రిక : జూన్ 5, 2013)* | ... | 16 |
| ★ | ప్రగతి<br>*('రచన' మాస పత్రిక : జూలై, 2013)* | ... | 28 |
| ★ | డిగ్నిటీ హోమ్స్<br>*('రచన' మాస పత్రిక : ఆగస్టు 2013)* | ... | 42 |
| ★ | భ్రమరం<br>*('రచన' మాస పత్రిక : సెప్టెంబరు, 2013)* | ... | 76 |
| ★ | కొండంత తిమిరం – గోరంత దీపం<br>*('రచన' మాస పత్రిక : అక్టోబరు, 2013)* | ... | 94 |
| ★ | చినికి చినికి గాలివాన<br>*('రచన' మాస పత్రిక : నవంబరు, 2013)* | ... | 114 |
| ★ | ఆడశక్తి<br>*('నవ్య' వార పత్రిక : దీపావళి, 2013)* | ... | 136 |
| ★ | బ్రేకింగ్ గుడ్ న్యూస్<br>*(ఆంధ్రజ్యోతి – ఆదివారం : నవంబరు 24. 2013)* | ... | 148 |
| ★ | నలుపు తెలుపు<br>*('రచన' మాస పత్రిక : డిసెంబరు, 2013)* | ... | 160 |
| ★ | షార్ట్‌కట్ శివ<br>*('రచన' మాస పత్రిక : జనవరి, 2014)* | ... | 174 |
| ★ | తానొకటి తలిస్తే...<br>*(ఆంధ్ర సచిత్ర వార పత్రిక : 19–10–1962)* | ... | 184 |

# అమ్మకథ

> *మూఢనమ్మకం ఎంత ప్రమాదకరమంటే,*
> *అది ప్రేమను బ్రతకనివ్వదు,*
> *ప్రేమ నుంచి బ్రతుకునివ్వదు!*




**హలో... హలో...**

ఎవరో చెవులో ఆలపించినట్లుగా ఉంది.

మెల్లగా కళ్ళు తెరిచాడు సుగంధ్.

ఇంకెవరు? భార్య అనఘ, తన ట్రేడ్‌మార్క్ చిరునవ్వుతో.

అప్పుడే తలస్నానం చేసినట్లుగా ఉంది. పచ్చని ముఖం మీద స్ఫటికం లాంటి నీటి బిందువులు. ఎర్రని కుంకుమరేఖ. కారుమబ్బుల్లా విస్తరించిన నల్లని కేశ సంపద. సన్నని జరీ అంచు, చిలకాకుపచ్చ కంచిపట్టు చీరలో మోహనంగా ఉంది అనఘ.

అలాగే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాడు సుగంధ్

బుగ్గమీద సుతిమెత్తగా తాకి. “ఏమిటా తన్మయత్వం?” అంది అనఘ.

గబుక్కున మీదకు లాక్కున్నాడు. కౌగిలిలో ఒదిగిపోయింది.

"ఇకచాలు లేవండి. ఆరు దాటింది. ఈ రోజు స్పెషల్ అని తెల్సుకదా" అంది అనఘ, మంచం మీంచి దిగుతూ.

"నిద్ర లేపి పైగా ప్రశ్నలా?" అన్నాడు చిలిపిగా సుగంథ్.

"మన పెళ్ళిరోజు కదా"

"మనం ఎలాంటి వేడుకలు చేసుకోం కదా"

"అమ్మనాన్న బ్రేక్‌ఫాస్ట్‌కి వస్తున్నారని చెప్పాకదా"

"గుర్తుంది. అయినా చాలా వింతగా ఉంది. చెన్నై నుంచి హైదరాబాద్‌కి మనతో బ్రేక్ ఫాస్ట్ కోసం వచ్చి, సాయంత్రం తిరిగి వెళ్ళిపోతున్నారంటే... ఇదేదో రాచకార్యం లాగా ఉంది! ఏమిటో చెప్పొచ్చుగా" అన్నాడు మురిపెంగా, భార్యని వళ్ళోకి లాక్కుంటూ.



"మనకు పెళ్ళై పదేళ్ళయింది. మీరు వచ్చే నెలలో నలభయ్యో పడిలోకి ప్రవేశించబోతున్నారు. నేను రెండేళ్ళలో నలభైలోకి ప్రవేశిస్తున్నాను. అయినా ఏమిటీ చిలిపితనం ... అంతులేని ఈ రొమాన్స్..."

"నువ్వెందుకంత అందంగా ఉంటావు మరి? అయినా రొమాన్స్‌కి ఏజ్‌తో పనేమిటోయ్?"

"సరసాలు ఇక చాలు కాని లేవండి. పదిలోపే అమ్మానాన్న వస్తామన్నారు. మీ కసరత్తులు, మెడిటేషన్లు ముగించటానికి కనీసం రెండు గంటలైనా పడ్తుంది. తర్వాత గంట పేపరుతో కుస్తీ. దీనికి తోడు వాటర్ థెరపీ. దానికో అరగంట..." – సుగంధ్‌ని బలవంతంగా లేపి, మంచం మీద కూర్చోబెట్టి కిచెన్‌వైపు దారి తీసింది అనఘ.

ఇంత సడన్‌గా అత్తమామల ఫ్లైయింగ్ విజిట్‌కి కారణమేమిటో రెండు రోజులుగా ఆలోచిస్తున్నాడు సుగంధ్.

మామగారు కృష్ణకాంత్ ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీకి ఫౌండర్ చైర్మన్.

అత్తగారు సరస్వతి గ్రాడ్యుయేట్ కాలేజీలో ప్రిన్సిపల్. ఇద్దరూ బిజీబిజీ. ఒక్కతే కూతురు అనఘ. తనకు రెండేళ్ళు జూనియర్ ఐ.ఐ.ఎమ్. అహ్మదాబాద్‌లో. తాను పిహెచ్.డి. రెండో సంవత్సరంలో ఉండగా, అనఘ రెండేళ్ళ పి.జి. ప్రోగ్రామ్‌లో చేరింది.

పరిచయం ప్రేమగా మారి పెళ్ళికి దారితీసింది. తన డాక్టరేట్, అనఘ పి.జి. రెండూ ఒకేసారి పూర్తయ్యాయి. అనఘ ఫైనాన్స్ విభాగంలో చేరింది, హైదరాబాద్‌లోని ఒక ఐ.టి. కంపెనీలో. సుగంధ్‌కి హెచ్.ఆర్.లో డెప్యూటీ మేనేజర్‌గా మరో ఐటి కంపెనీలో ఉద్యోగమొచ్చింది హైద్రాబాద్‌లోనే.

ఇద్దరికీ మంచి సంపాదన. మంచి వారు అనే ముద్ర – అటు పనిచేసే సంస్థల్లో, ఇటు నివసిస్తున్న ఎపార్ట్‌మెంట్స్‌లోనూ.

చీకూ చింతాలేని జీవితం. హాయిగా, ఆనందంగా గడిచిపోతోంది ఇద్దరికీ.

★ ★ ★

అనఘ తండ్రికిష్టమయిన వడ, సాంబారు తల్లి కిష్టమయిన వెజిటబుల్ ఎర్రనూక ఉప్మా, పతికి ఇష్టమయిన ఇడ్లీకి కావలసినవి రెడీ చేయటానికి వంటింట్లోకి వచ్చింది. వంటావిడ ఎనిమిదింటికిగానీ రాదు. ఈలోగా అల్లం చెట్నీ, కొబ్బరి చెట్నీ చేస్తే సరిపోదా అనుకొని ఆ కార్యక్రమంలో మునిగిపోయింది.